


నేడు నీటిపారుదల సలహా మండలి సమావేశం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో శనివారం కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో నీటిపారుదల సలహామండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారి శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జలాశయాల నీటి లభ్యత, ఖరీఫ్ 2025-26 పంటలకు నీటి విడుదల, అభివృద్ధి పనులు, సాగుబడి తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొంటున్నట్లు వివరించారు.

సిద్ధాపురం ఎత్తిపోతల పథకంపై కూటమి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని సుమారు 21,300 ఎకరాల పంట భూములకు రబీ సీజన్‌లో సాగునీరు అందించేందుకు గాను 2006 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2014లో టీడీపీ ప్రభుత్వం సిద్ధాపురం పథకాన్ని పూర్తి చేసి 2018 జనవరి 7న ప్రారంభించింది. తొలుత రూ.89.72కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని నిర్మించాలని భావించినప్పటికీ అంచనాలు భారీగా పెరగడంతో రూ.116.52 కోట్లు ఖర్చయింది. తాజాగా సుమారు రూ.80 కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

సిద్ధాపురంపై కూటమి ఫోకస్..!

- వీబీఆర్‌లో 7.5టీఎంసీల నుంచే నీటి ఎత్తిపోతలకు కసరత్తు
- యుద్ధప్రాతిపదికన అప్రోచ్ కెనాల్ పూడికతీత పనులు
- రెండు ప్రధాన తూము గేట్ల వద్ద భద్రత చర్యలు
- సుమారు రూ.80 కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు



పూడికకు గురైన అప్రోచ్ కెనాల్ ఇదే (ఫైల్)

ఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా 21,300 ఎకరాలకు సాగునీరందించి ఆయకట్టును స్థిరీకరించాలనుకున్నారు. ఆత్మకూరు మండలంలో 17,950 ఎకరాలు, పాములపాడు మండలంలో 3,350 ఎకరాల ఆయకట్టును నిర్దేశించారు. ప్రధానంగా వెలుగోడు జలాశయంలో 5.6 టీఎంసీలకు నీటినిల్వలకు తగ్గకుండా ఉన్నప్పుడే వీబీఆర్ నుంచి సిద్ధాపురం చెరువులోకి 200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్టును నిర్మించారు. ఇందులో భాగంగా స్టేజ్-1 పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టి అక్కడి నుంచి రెండు భారీ మోటార్ల ద్వారా (ఒక్కో మోటారు 100 క్యూసెక్కుల సామర్థ్యం) నీటిని 40 అడుగుల ఎత్తులో నిర్మించిన సర్జ్‌ట్యాంక్‌లోకి ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ మీదుగా 6.750కిమీల దూరం అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా ప్రవహించి స్టేజ్-2 పంప్‌హౌస్‌లోకి చేరుతాయి. అక్కడ వున్న మరో రెండు భారీమోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి, 0.975కిమీల దూరంలో వున్న చెరువులోకి వీబీఆర్ జలాలు చేరుకునేలా ప్రాజెక్టును నిర్మించారు. రెండు పంప్‌హౌస్‌లకు విద్యుత్‌సరఫరా అందించేందుకు అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి 33/11 రెండు పవర్‌స్టేషన్‌లను నెలకొల్పారు. వీటికి ఆత్మకూరు 132/33 విద్యుత్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది.



అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత పనులను చేపడుతున్న దృశ్యం

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి రెగ్యులర్ మెయింటెనెన్స్ నిధులను కూడా ఇవ్వలేదు. చెరువు కట్ట మీద కంపచెట్లు పెరిగాయి. కట్టపై కూడా గుంతలుపడ్డాయి. కనీసం జంగిల్ క్లియర్ పనులు కూడా చేపట్టలేదు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అధ్వానంగా ప్రాజెక్ట్ నిర్వహణ

2021 డిసెంబరు 5న ఎడమ ప్రధాన కాల్వ వద్ద చెరువు కట్టకు రంధ్రాలు పడ్డాయి. ఇరిగేషన్ అధికారులు అష్టకష్టాలు పడి నీటి లీకేజీలను అరికట్టారు. ఆ తర్వాత 2022 డిసెంబరు 15న ఎడమ ప్రధాన కాల్వ తూమ్ గేట్‌ను ఎత్తే క్రమంలో గేట్‌రాడ్ స్ట్రక్ అవ్వడంతో గేటు ఇనుప రేకులు ఒరిగిపోయాయి. సుమారు 100 క్యూసెక్కుల మేర నీరు సమీప పంటపొలాల్లోకి చేరి రైతులు నష్టపోయారు. ఆ సమయంలో చెరువులో గరిష్ఠ నీటినిల్వలు ఉండటంతో గేట్లను మరమ్మతు చేసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. చివరకు వరిగడ్డి, కర్రలను అడ్డుగా వుంచి నీటి ప్రవాహాన్ని కట్టడి చేశారు. అలాగే మూడు ట్రిప్పర్లలో స్టోన్‌డస్ట్‌ను తరలించి తూము ప్రవాహమార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. అయినా నీరు వృథా అయింది.



కుడి ప్రధాన కాల్వ తూము వద్ద నిర్మించిన కాంక్రీట్ స్టెప్స్



వీబీఆర్‌లో 7.5 టీఎంసీల నీటి ఎత్తిపోతలకు కసరత్తు

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 6టీఎంసీల నీటినిల్వలు ఉన్నట్లయితే అప్రోచ్ కెనాల్ ద్వారా స్టేజ్-1 పంప్‌హౌస్ వద్దకు నీరు చేరుతాయి. ఈ అప్రోచ్ కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో వీబీఆర్‌లో 9.5టీఎంసీలు దాటిన తర్వాతే స్టేజ్-1 పంప్‌హౌస్ వద్దకు నీరు చేరుకుంటున్నాయి. దీనివల్ల సిద్ధాపురం ప్రాజెక్టుకు నీరు అందడం ఆలస్యమవుతోంది.

మిగతా 6వ పేజీలో

బీమాపై అవగాహన కల్పించండి

- కలెక్టర్ రాజకుమారి
- వ్యవసాయాధికారులతో సమావేశం



బీమా బ్రోచర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల టౌన్/ నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో పంటల బీమాపై జిల్లా వ్యవసాయాధికారులు, బ్యాంక్ అధికారులతో కలెక్టర్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు వేసే ప్రతి పంటకు తప్పనిసరిగా బీమా చెల్లించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. పంటల బీమా చేయించడంతో తుపాన్లు, కరువు తదితర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లిస్తారన్నారు. రైతులు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని కోరారు. పంటలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని ఆర్ఎస్‌కేల వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, ఎల్‌డీఎం రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

అక్రమార్కుల్లో అలజడి..!

- ప్రజాప్రతినిధి వద్దకు పరుగులు
- సమీప బంధువు ద్వారా అక్కడికి..
- ఓ అధికారిది అదే దుస్థితి
- డిప్యూటీ సీఎం స్థాయిలో చర్చకు సన్నాహాలు



నంద్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురించడం జిల్లాలో కలవరం రేపింది. శుక్రవారం కూడా 'పంచాయతీని కాజేశారు..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అక్రమార్కుల్లో ఒక్కసారిగా ఆలజడి రేపినట్లైంది. ఆ శాఖ కమిషనర్ జరిగిన అక్రమాల పరంగా.. రూ.2.13 కోట్లు రికవరీతో పాటు కఠిన చర్యలకు ఆదేశించడంతో సదరు సర్పంచ్‌తో పాటు పలువురు కార్యదర్శులు, ఉన్నతాధికారుల్లో భయాందోళన మొదలైంది. రెండు వారాల్లోనే చర్యలు కూడా తీసుకోవాలని షరతు విధించడం అక్రమార్కుల్లో ఉలిక్కిపడినట్లైంది. ఈ నేపథ్యంలో సదరు సర్పంచ్‌తో పాటు పలువురు ఉద్యోగులు సైతం సదరు నియోజకవర్గంలోని ఓ కీలక ప్రజాప్రతినిధి వద్దకు ఉదయాన్నే పరుగులు తీసినట్లు సమాచారం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారందరూ అక్కడే ఉండి తమపై ఎలాటి కఠిన చర్యలు లేకుండా చూడాలని సదరు ప్రజాప్రతినిధి వద్ద మొరపెట్టుకున్నారని తెలిసింది. సదరు సర్పంచ్ సైతం తమ సమీప బంధువైన ఓ టీడీపీ నాయకుడి ద్వారా ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లినట్లు తెలిసింది. వీరితో పాటు మరికొంతమంది ఉద్యోగులు సైతం సదరు ప్రజాప్రతినిధిని ఆశ్రయించినట్లు సమాచారం. వీరిలో ఓ కీలక అధికారి కూడా అక్కడికి వెళ్లి సాయం కోరినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా కలెక్టర్ రాజకుమారి సైతం సదరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై సీరియస్‌గా తీసుకున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. సదరు ప్రజాప్రతినిధి సైతం సదరు అక్రమార్కుల కోసం ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్థాయిలో మాట్లాడి కొంత వరకు సహకరించే విధంగా చూస్తానని వారికి హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఏది ఏమైనా సదరు పంచాయతీలో జరిగిన అక్రమాలతో పాటు అక్రమార్కుల చిట్టా బయటకు రావడం.. రికవరీతో పాటు చర్యలకు ఆదేశించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆశాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం క్షేత్రస్థాయిలో జిల్లా యంత్రాంగం అమలు చేస్తారా? సదరు ప్రజా ప్రతినిధి ఒత్తిళ్లతో ఏమైనా తగ్గుతారా? అనే సందేహాలు లేకపోలేదు. ఇదిలా ఉండగా అవినీతి అక్రమాలకు పాల్పడిన సదరు పంచాయతీ అధికారికి శుక్రవారం సాయంత్రం అధికారులు సస్పెన్షన్‌కు సంబంధించి ఉత్తర్వులను పంపినట్లు సమాచారం.

కేసీకి నీరు విడుదల చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలంటూ కలెక్టర్ రాజకుమారికి రాయలసీమ సాగునీటి సాధనసమితి నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రాయలసీమ సాగునీటి సాధనసమితి నాయకులు వైఎన్ రెడ్డి, రామసుబ్బారెడ్డి మాట్లాడారు. గతనెలలో అడపాదడపా వర్షాలు కురియడంతో రైతులు కేసీ కెనాల్ కింద ఆరుతడి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం పూత, పిందెదశల్లో ఉన్నాయన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడతో పంటలు ఎండే పరిస్థితి నెలకొందని కలెక్టర్‌కు వివరించారు. నీళ్లు ఉన్నప్పటికీ మరమ్మతుల పేరుతో జలవనరుల శాఖ అధికారులు నీటిని విడుదల చేయడం లేదన్నారు. శనివారం జరిగే సాగునీటి సలహామండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు రామకృష్ణారెడ్డి, పట్నం రాముడు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

హామీలు తప్పుతున్న సీఎం

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- ప్రజా సమస్యలను పక్కన పెట్టి పదవుల కోసం కుమ్ములాట
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఆలూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను తప్పుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆలూరు పట్టణంలో పార్టీ 12వ మహాసభ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాత బస్టాండు వద్ద నిర్వహించిన బహిరంగ సమావేశం ఆలూరు మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పేరిట ప్రభుత్వం కోట్లాది రూపాయలు అప్పులు చేస్తుందన్నారు. ఎన్నికల ముందు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చి నేడు జాప్యం చేస్తున్నారని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను, ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. టీడీపీ నాయకులు అభివృద్ధి మరిచి కుమ్ములాటలతోనే కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా నాయకులు భూపేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి నబీరసూల్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఐదేళ్లు జగన్ అరాచకాలు

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

6

ఎరువుల షాపులపై దాడులు

18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత

7

మార్గదర్శకులను గుర్తించండి

న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలులో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్, పీ-4 కింద మార్గదర్శకులను గుర్తించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన అభివృద్ధి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో అవసరమైన వనరులను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. పీ-4 విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేలా చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవసాయం, పాడి పరిశ్రమ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మహానంది మండలం అభివృద్ధి చెందుతున్నంత త్వరగా గోస్పాడు మండలం ఎందుకు అభివృద్ధి చెందడంలేదని ప్రశ్నించారు. దీనికి అధికారుల వద్ద సమాధానం లేక మౌనంగా ఉండిపోయారు. మండలాల వారిగా ఆదాయం, అభివృద్ధి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చల్లా విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్త వారికి పీఎం కిసాన్ ఇవ్వరా?

- ప్రతి ఏటా తగ్గుతున్న అర్హుల సంఖ్య
- సాయానికి దూరంగా 1.19 లక్షల మంది రైతులు



కొలిమిగుండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కర్షకుల కష్టాలను కాస్తయినా తీర్చాలని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కొత్తవారికి ఇచ్చేలా కనిపించడ లేదు. పెట్టుబడి సాయానికి, కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులకు ఈ పథకం అందడం లేదు. ఆరేళ్లుగా కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదు. కొత్త వారికి అవకాశం లేకపోగా పథకం వర్తించిన రైతులు అర్హత కోల్పోతున్నారు. దీంతో ఈ పథకం కింద లబ్ధిదారుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది. సాగుదారులకు పెట్టుబడి సాయంగా ప్రతి ఏటా రైతన్నలకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం రూ.6వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. ఏడాదిలో మూడు విడతలు రూ.2000 చొప్పున అన్నదాతల ఖాతాల్లో ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకాన్ని అమలులోకి తీసుకవచ్చింది. అయితే 2019 ఫిబ్రవరి-1కి ముందు పట్టాదార్ పాసు పుస్తకం ఉండి, ఆన్‌లైన్ .. వెబ్ ల్యాండ్ .. అడంగల్‌లో పేర్లు ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు. దీంతో 2019 ఫిబ్రవరి-1 తర్వాత భూములు కొన్న కొత్త రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఏడాది	కర్నూలు లబ్ధిదారులు	నంద్యాల లబ్ధిదారులు
2022-23	2,57,796	2,21,241
2023-24	2,44,386	2,10,509
2024-25	2,42,934	1,98,000

ప్రతి ఏటా తగ్గుతున్న అన్నదాతల సంఖ్య

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి ప్రతి ఏటా రైతుల సంఖ్య తగ్గుతోంది. 2019 ప్రారంభ సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.60 లక్షల మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఈకేవైసీ పూర్తి చేసుకోక పోవడం, రేషన్ కార్డులు కోల్పోవడం, ఇన్‌కం ట్యాక్స్ పరిధిలోకి రావడం, కొందరు లబ్ధిదారులు మృతి చెందడం తదితర అనేక కారణాలతో ఈ ఆరేళ్లలో 1.19 లక్షల మంది రైతులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకాన్ని కోల్పోయారు. తాజాగా ఇటీవల ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం అందించిన 19వ విడత పెట్టుబడి సాయానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4.40 లక్షల మంది రైతులకు రూ.88.01 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు.



కుటుంబంలో ఒక్కరికే అవకాశం: మరోవైపు ఒక కుటుంబంలో ఎంత మంది రైతులున్నా ఒక్కరికే పెట్టుబడి సాయం అందుతోంది. దీంతో భూములు ఉన్నప్పటికీ రైతులు పెట్టుబడి సాయాన్ని అందుకోలేక పోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష మందికి పైగా కొత్తగా పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి కేంద్రం అవకాశం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆటోల్లో నీరు తెచ్చి నాట్లు..


బిల్లేకల్‌లో నీరు పోసి టమోటా మొక్కలు నాటుతున్న రైతులు

వరుణుడు ముఖం చాటేయడంతో రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. జూలై నెలలో ఎండలు అధికమై తేమశాతం లేకపోవడంతో నీళ్లు పోసి టమోటా మొక్కలు నాటుతున్నారు. మండలంలోని బిల్లేకల్ గ్రామంలో నల్లన్న అనే రైతు శుక్రవారం ఆటోల్లో నీళ్లు తీసుకొచ్చి మొక్కమొక్కకు నీరుపోసి నాటు వేస్తున్నారు. 1.50 ఎకరాల పొలంలో టమోటా నారను ఎన్నో వ్యయ ప్రయాసలతో నాటుకున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ యేడాది ఖరీఫ్‌లో వేసిన పంటలు ఎండిపోతుండడంతో నష్టాలు తప్పడం లేదని తెలిసినా ఇలా నీళ్లు తెచ్చి మొక్క మొక్కకు అందిస్తున్నాడు.

● ఆస్పరి, ఆంధ్రజ్యోతి




ఆటోలో తెచ్చిన నీరు పట్టుకుంటున్న రైతు, మహిళ

సిద్ధాపురంపై కూటమి ఫోకస్..!


సిద్ధాపురం చెరువు

(5వ పేజీ తరువాయి)

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత పనులకు రూ.20లక్షల నిధులను మంజూరు చేయించారు. దీని వల్ల వీబీఆర్‌లో 7.5 టీఎంసీల నీరు ఉన్నప్పటి నుంచే సిద్ధాపురం ప్రాజెక్టుకు నీరు అందిస్తున్నారు.

రెండు ప్రధాన తూము గేట్ల వద్ద భద్రతా చర్యలు

సిద్ధాపురం ప్రాజెక్ట్ పరిధిలోని కుడి, ఎడమ రెండు ప్రధాన తూములకు అప్పుడప్పుడు చిన్నరంధ్రాలు పడి నీరు లీకైన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ భద్రతను దృష్టిలో ఉంచుకుని రెండు ప్రధాన తూముల వద్ద కాంక్రీట్ స్టేప్ పనులను చేపడుతున్నారు. తూము గేట్లకు మరమ్మతు పనులు చేసి నీరు వదిలే సమయంలో ఎలాంటి మొరాయింపు లేకుండా చర్యలు తీసుకున్నారు.

సుమారు రూ.80కోట్లతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం వచ్చాక సిద్ధాపురం మట్టికట్టపై జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశారు. గుంతలను పూడ్చేశారు. రూ.25లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ మరమ్మతులను, అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత, తూము గేట్ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలను పూర్తిచేశారు. ఇవికాక అండర్ గ్రౌండ్ కరెంట్ కేబుల్ తరచూ మరమ్మతులకు గురికావడంతో ఓవర్ హెడ్ కరెంట్ కేబుల్ ఏర్పాటుకు రూ.10కోట్లు, ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో పూర్తికాని బ్రాంచ్, ఫీల్డ్ కెనాల్స్ తూముల ఏర్పాటుకు మరో రూ.14కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే ఈ ప్రాజెక్టుకు అనుసంధానంగా వెంకటాపురం గ్రామ సమీపంలోని కుడి ప్రధాన కాల్వ నుంచి 6కిమీల దూరంలో శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, అమలాపురం, కృష్ణాపురం గ్రామాల పరిధిలోని సుమారు 5వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు గాను రూ.25కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇవేకాకుండా వెలుగోడు జలాశయం నుంచి స్టేజ్-1 వరకు ఉన్న అప్రోచ్ కెనాల్ పూడికకు గురికాకుండా మరింత లోతులో కాంక్రీట్ బెడ్, ఇరువైపులా కాంక్రీట్ గోడల నిర్మాణానికి మరో రూ.30కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.


సకాలంలో నీరందిస్తే రైతుల జీవితాలు బాగుపడతాయి



సిద్ధాపురం ఆయకట్టు పొలాలకు సకాలంలో సాగు నీరందిస్తే రైతుల జీవితాలు మరింత బాగుపడతాయి. వీబీఆర్ నుంచి స్టేజ్-1 పంప్‌హౌస్ వరకు ఉన్న అప్రోచ్ కెనాల్‌లో తొలిసారిగా పూడికతీత పనులను చేయించాం. అప్రోచ్ కెనాల్‌లో పూడికతీత పనుల వల్ల వీబీఆర్‌లో 7.5టీఎంసీల నీటినిల్వలు ఉన్నప్పటి నుంచే సిద్ధాపురం నీరందించవచ్చు.

● బుడ్డా రాజశేఖరరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే

విద్యార్థుల కోసమే..


విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు

- లక్ష్య సాధన కోసం 'కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్'
- ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్య భూమిక
- నంద్యాల జిల్లాలో 12 మంది నియామకం
- ఒక్కో కౌన్సిలర్‌కు 20 ప్రభుత్వ పాఠశాలలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే కాదు.. విద్యార్థుల కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆలోచిస్తుంది. వారిలో పరీక్షల భయం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను అధిగమించేందుకు 'మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల'ను నియమించింది. లక్ష్య సాధనలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు వీరు ఎంతో సహాయపడుతారు. శిక్షణ పొందిన వారిని కెరీర్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్‌లుగా నియమించారు. ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ఆఫ్ ఇండియా, సమగ్రశిక్ష అభియాన్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా 255 మందిని నియమించారు. నంద్యాల జిల్లాకు 12 మందిని కేటాయించారు. వీరంతా జిల్లా గర్ల్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.



కౌన్సిలర్ల విధులు...

జిల్లాలోని జడ్పీ హైస్కూల్స్ కేజీబీవీలు, ఎంపీయూపీ, ఏపీ మోడల్ స్కూల్స్ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి కౌన్సిలర్ 18 నుంచి 20 పాఠశాలలను ఎంపిక చేసుకుని విద్యార్థులకు వివిధ సేవలను అందించాలి. కెరీర్, మార్గదర్శకత, మానసిక ఆరోగ్యసేవలు, జీవన నైపుణ్యశిక్షణ, వ్యక్తిగత కౌన్సెలింగ్, పరీక్షల భయం, ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలకు వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇవ్వాలి. సైన్స్, ఆర్ట్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి విద్యామార్గాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. విద్యార్థుల ఆరోగ్యంపై వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థుల సామర్థ్యాలపై సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థి ప్రవర్తన, మార్పులపై వారికి వివరించాల్సి ఉంది. ప్రతి కౌన్సిలర్ విద్యార్థుల సామర్థ్యాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి భవిష్యత్ ప్రణాళికకు సూచనలిస్తున్నారు. అవసరమనిపిస్తే విద్యార్థులను నిపుణుల వద్దకు పంపి వారిని నిరంతరం పర్యవేక్షించాలి.

ఆత్మ విశ్వాసం పెంచుతూ..



విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నిర్మాణానికి కౌన్సిలర్ పాత్ర పునాది వేస్తుంది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతూ మంచి లక్ష్యాలను సాధించేలా చేయడమే లక్ష్యం. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విప్లవాత్మకమైన మార్పు విద్యార్థుల శ్రేయస్సుకు దోహదం చేస్తుంది.

● నాగసువర్చల, జీసీడీవో, నంద్యాల

వ్యక్తిగత కౌన్సెలింగ్‌తోనే ముందుకు..



విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులు, శక్తిసామర్థ్యాలను గ్రహించి వారి ఆకాంక్షలను అర్థం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయం చేసి విద్యార్థులకు సరైన కెరీర్ గైడెన్స్ కల్పిస్తూ ముందుకు వెళ్తున్నాం.

● శ్రీరామ్, కెరీర్ కౌన్సిలర్, మిడ్తూరు మండలం

విద్యా వ్యవస్థలో ముఖ్య పాత్ర



ప్రభుత్వం నియమించిన కెరీర్ కౌన్సిలర్స్ విద్యావ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. శిక్షణ పొందిన నిపుణులను అందుబాటులోకి తెచ్చి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో మద్దతు, మార్గదర్శకత్వం ఎంత ముఖ్యమో ప్రభుత్వం గుర్తించింది. సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నియమించిన కౌన్సిలర్స్‌కు 18 నుంచి 20 ప్రభుత్వ పాఠశాలలను కేటాయిస్తున్నాం. విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు వీరు దోహదపడుతారు.

● ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, సమగ్రశిక్షా అభియాన్, నంద్యాల

వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తున్నాం



మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు కొత్త వాతావరణం అలవాటుపడేలా వారికి సహాయపడుతున్నాం.

● ప్రమీల, కెరీర్ కౌన్సిలర్, జూపాడుబంగ్లా మండలం

'పీ-4'ద్వారా పేదలకు ఆసరా

- కౌలుట్లయ్య కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం
- మార్గదర్శిగా కంటి వైద్య నిపుణుడు డా. సుధాకర్‌రావు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా


కౌలుట్లయ్యకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలను ఆదుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో 'స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్- మార్గదర్శి - బంగారు కుటుంబం' కింద గోనెగండ్ల నివాసి బోయ కౌలుట్లయ్య అనే రైతు కుటుంబానికి కలెక్టర్ రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గోనెగండ్లకు చెందిన బోయ కౌలుట్లయ్య పేదరికం వల్ల ఇబ్బందులు పడుతుండటంతో బంగారు కుటుంబంగా గుర్తించి మార్గదర్శిగా ముందుకు వచ్చిన సుశీల నేత్రాలయ వైద్యశాల కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు ద్వారా ఆర్థికసాయం అందించారు. రూ.2లక్షల డబ్బుతో పాడి గేదెలను కొనుగోలు చేసి జీవన ఉపాధి పొందాలని కౌలుట్లయ్యకు సూచించారు. మంచి పాడి గేదెలను చూసి ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖ అధికారిని ఆదేశించారు. మిగిలిన డబ్బుతో ఏమైనా లోన్లు ఉంటే తీర్చేసుకుని వ్యవసాయం చేసుకోవాలని రైతుకు సూచించారు. బంగారు కుటుంబంగా గుర్తించిన కౌలుట్లయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందించిన డాక్టర్ సుధాకర్‌రావును అభినందించారు. సుశీల నేత్రాల వైద్యశాల కంటి నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

తల్లి భాషకు రక్షణ ఛత్రం పడదాం..!

- నేటి నుంచి రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు
- టీజీవీ కళాక్షేత్రానికి పలువురు ప్రముఖుల రాక


సమావేశంలో మాట్లాడుతున్న కేసీ కల్కూర

కర్నూలు కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగులు విరబూయిద్దాం.. అమ్మభాషకు రక్షణ ఛత్రం పడదామంటూ రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం ఆడిటోరియంలో జరగనుంది. శనివారం, ఆదివారం జరిగే ఈ భాషా పరిరక్షణ సదస్సుకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి భాషా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈమేరకు శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సదస్సు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ మాతృభాషను ముందు తరాలకు అందించకపోతే అది మృతభాషగా మారిపోతుందన్నారు. సదస్సు ఉపాధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రముఖుల, భాషావేత్తల అభిప్రాయాలను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు, మద్రాసు తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు తూమాటి సంజీవరావు, విశ్రాంత ఆర్‌యూ ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సదస్సులో మాట్లాడతారని తెలిపారు.

15న జాబ్ మేళా

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా నిరుద్యోగుల కోసం ఈనెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. నంద్యాల పట్టణంలోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే క్రెడిట్ అసెస్ జర్మన్ ప్రైవేట్ లిమిటెడ్, మహీంద్రా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ట్రైనీ మేనేజర్, టెక్నీషియన్ పోస్టులకు ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి 20వేల దాకా జీతం ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఐటీఐ, ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. వివరాలకు 99081 14205 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముస్లిం విద్యార్థులకు ఉపకార వేతనాలు

నంద్యాల రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం విద్యార్థులకు ఈనెల 13న అంజుమాన్ షాదీఖానాలో ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఖుద్దూస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యాప్రగతిని సాధించేందుకు ఆర్థిక తోడ్పాటును కల్పించడానికి అంజుమాన్ కమిటీ సాయపడుతుందన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.3వేల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.

ఐదేళ్లు జగన్ అరాచకాలు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఎమ్మెల్యే బీవీతో కలిసి ఎమ్మిగనూరులో 'తొలి అడుగు'
- మంత్రికి ఘనస్వాగతం, భారీ గజమాలతో సన్మానం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

ఎమ్మిగనూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు రాష్ట్రంలో వైఎస్ జగన్ ఎన్నో అరాచకాలు చేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆరోపించారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో 'తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డితో కలిసి పాల్గొన్నారు. మంత్రి టీజీ భరత్‌కు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికి, భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాక్షసపాలన సాగించిన వైఎస్ జగన్ ఇప్పుడు మరోసారి పాదయాత్ర చేసి సీఎం అవుతానని అంటున్నారని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందన్నారు. ఇంటింటికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామన్నామని, ప్రజలు దీన్ని గమనించాలన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయని జగన్ ఐదు కోట్ల మంది ప్రజలకు ఎం న్యాయం చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కు స్థలం తిరిగి సాధించటానికి ఎమ్మెల్యే తీవ్రంగా శ్రమించారన్నారు.

మాటను నిలబెట్టుకున్న నారా లోకేశ్

ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. 'తొలి అడుగు' సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ అందరికీ 'అమ్మ ఒడి' అంటూ ఒక్కరికే ఇచ్చారని విమర్శించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ నాయుడు, నాయకులు రామదాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ సమావేశానికి హాజరైన టీడీపీ కార్యకర్తలు

జనాభా సమతుల్యత పాటించాలి

- క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు
- సిల్వర్ జూబ్లీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జనాభా విషయంలో ప్రతి ఒక్కరూ సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్థిక శాఖ అధ్యాపకుడు డాక్టర్ జీ.ఎల్లకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జీవన ప్రయాణంలో జీవితాన్ని బ్యాలెన్స్‌గా చేసుకుని అడుగులు వేయాలన్నారు. నేటి యువత జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనే ఉద్దేశ్యంతో వివాహాలు వాయిదా వేస్తున్నారని, దీంతో జనాభా పెరుగుదల రేటు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ 20ఏళ్ల తర్వాత యువశక్తి తగ్గిపోతుందని, జననాల రేటు తగ్గి పోవడమే ప్రధాన కారణమని అన్నారు. కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల మధ్య పెండింగ్‌లో ఉన్న వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం విశేషంగా తోడ్పడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. "మధ్యవర్తిత్వం- దేశం కోసం" అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం గురించి ప్రచారం చేసేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కక్షిదారులు తమ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలన్నారు. ఆ తర్వాత ఆయన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. వెంకట హరినాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 20ని ఉపసంహరించాలి

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు
- ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు

కర్నూలు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల పాటు ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన విద్యార్థుల పాలిట శాపంలా మారిన జీవో నెంబర్ 20ని తక్షణమే ఉపసంహరించాలని ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జే.లక్ష్మీనరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని చెక్ పోస్టులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 20 రాష్ట్ర విద్యార్థులకు ఇబ్బందికరంగా తయారైందన్నారు. ఈ జీవో ప్రకారం ఇంటర్మీడియట్ రాష్ట్రంలో చదివిన విద్యార్థులు మాత్రమే ఇంజనీరింగ్ అడ్మిషన్లకు అర్హులని చెప్పడంతో ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నెంబర్ 20ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నంద్యాల జనరల్ సెక్రటరీ ఎస్ రజాక్ వలీ, కేకేసీ నంద్యాల జిల్లా చైర్మన్ పఠాన్ హబీబ్, జిల్లా సెక్రటరీ వెంకట నాయుడు, ఓర్వకల్లు మండలాధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

- ఆరు నెలల్లో 640 కేసులు నమోదు
- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలు తెచ్చిపెడుతున్న మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా.. వారు వాహనాలు నడిపినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే రూ.5వేలు జరిమానా విధిస్తామన్నారు. మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులకు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. మరలా రిపీట్ అయి ప్రమాదాలకు కారణమైతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాక జీవితాంతం లైసెన్సును రద్దు చేస్తామన్నారు. ఎవరైనా మితిమీరిన వేగంతో సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, సైలెన్సర్లు తీసి ద్విచక్రవాహనాలతో విన్యాసాలు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించినా అలాంటి వారిపై చర్యలు తప్పవన్నారు. మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి ఆరు నెలల్లో 640 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

రిటైర్డ్ ఏడీకి నోటీసులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా విద్యాశాఖలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉదయ్‌కుమార్ అనే రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)కు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ నోటీసును జారీచేశారు. 2023వ సంవత్సరంలో చెక్‌బౌన్స్ కేసులో కోర్టు నుంచి వచ్చిన తాఖీదులతో ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఉంటున్న ఉదయ్‌కుమార్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసును పంపారు. 10 రోజుల్లోగా రాతపూర్వకంగా సరైన సమాధానం ఇవ్వాలన్నారు. వారికి సంబంధించిన అన్ని లావాదేవీలను నిలిపివేయాలని విద్యాశాఖను ఆదేశించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


భాస్కర్‌రెడ్డి (ఫైల్)

రుద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘటన రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నంద్యాల భాస్కర్‌రెడ్డి(48) తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో 19 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసేవాడు. పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో పంట పెట్టుబడుల కోసం రూ.19 లక్షలు అప్పులు చేశాడు. అప్పులను తీర్చలేక ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న దొడ్లవాగు సమీపంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక రైతు మృతి చెందాడు. మృతుడికి భార్య సుభద్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈర్లపాడులో మరో రైతు...

బండిఆత్మకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన పెద్ద వెంకట సుబ్బయ్య (49) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలివీ.. పెద్ద వెంకట సుబ్బయ్య తనకున్న రెండున్నర ఎకరాల సొంత పొలంతో పాటు, మరో 13 ఎకరాల భూమిని గత మూడు సంవత్సరాలుగా కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నారు. అయితే వ్యవసాయంలో సరైన దిగుబడులు రాక, పెట్టిన పెట్టుబడులు అప్పులయ్యాని, దీంతో అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో గురువారం సాయంత్రం ఇంట్లోనే గడ్డి మందు తాగారు. బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సమయంలో మృతి చెందారు. పెద్ద వెంకటసుబ్బయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్థానికుల తొలగింపుపై దుమారం

- మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద నిరసనలు
- ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్న కార్మికులు


కార్మికులతో మాట్లాడుతున్న మాధవరం ఎస్ఐ విజయకుమార్

మంత్రాలయం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో మారుతి ఇస్పాత్ ప్రైవేటు లిమిటెడ్ (మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ)లో పని చేస్తున్న స్థానిక కార్మికులను తొలగించడంతో దుమారం రేగింది. రోజూ కొంత మందిని టార్గెట్ చేస్తూ యాజమాన్యం కార్మికులను తొలగించే నిర్ణయం తీసుకోవడంతో స్థానికంగా ఉండే కార్మికులు భగ్గుమన్నారు. దీంతో శుక్రవారం ఉదయం ఫ్యాక్టరీ ముఖద్వారం ముందు తమ బైకులను అడ్డుగా పెట్టి ధర్నా చేశారు. కార్మికులను తొలగించి కడుపు కొడుతున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫ్యాక్టరీలోకి ఉద్యోగులను వెళ్లనీయకుండా.. లోపలి నుంచి ఉద్యోగులను బయటకు రానీయకుండా దాదాపు 5గంటలసేపు అడ్డుకున్నారు. దీంతో మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్, హెడ్ కానిస్టేబుల్ రాముడు, పోలీసు సిబ్బందితో వచ్చి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కార్మికులు మాట్లాడుతూ స్థానికులను వదిలేసి ఒరిస్సా, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి కార్మికులను తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నారని మండిపడ్డారు. గురువారం రాత్రి పది మంది కార్మికులను తొలగించామని ప్రకటన చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రూ.25వేలు ఇచ్చిన వెట్టి చాకిరి చేస్తున్నామని, అదే బీహార్, ఒరిస్సా కార్మికులకు రూ.40వేల నుంచి రూ.50వేలకు ఇస్తున్నారని తెలిపారు. అనంతరం పోలీసులు ఫ్యాక్టరీ యాజమాన్యం ప్లాంట్ ఇన్‌చార్జి షమీర్, హెచ్‌ఆర్ జీఎం శ్రీనివాసులు, ప్లాంట్ హెడ్ రాకేష్ పాండే, ప్లాంట్ వైస్ ప్రెసిడెంటు సునీల్ సింగ్‌తో ఎస్ఐలు చర్చలు జరిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఫ్యాక్టరీ యాజమన్యంతో చర్చలు జరిపారు. మరో రెండు రోజుల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

వ్యవసాయ సహకార సంఘాలకు చైర్మన్ల ఎంపిక

- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రెండు సొసైటీలు
- ఆదోని నియోజకవర్గంలో మూడు సొసైటీలకు త్రిసభ్య కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


కడిమెట్ల విరుపాక్షిరెడ్డి


ఎన్వీ ఆంజనేయులు


ఎం.దామోదర్ చౌదరి


వి.అన్వర్ బాషా

కర్నూలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘాలకు (పీఏసీఎస్) ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను ఎంపిక చేసింది. శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీసీవో వెంకటకృష్ణ, కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు తెలిపారు. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, సభ్యులుగా రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన కాపు మురళీకృష్ణారెడ్డిని, కడిమెట్లకు చెందిన బి.కేశన్నను నియమించారు. గోనెగండ్ల పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన ఎన్వీ రామాంజనేయులు, సభ్యులుగా కడపల రమేశ్, కురవ వెంకటేశ్వర్లును ఎంపిక చేశారు. ఆదోని నియోజకవర్గం పరిధిలో మదిరె పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా మండగిరికి చెందిన ఎం. ఆమోదర్ చౌదరి, సభ్యులుగా ఇస్వీ గ్రామానికి చెందిన దూదేకుల మగ్దుమ్ బాషా, సంగిపోగుల లక్ష్మమ్మ, పెద్దతుంబళం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్‌గా వి. అన్వర్‌బాషా, సభ్యులుగా కొరవన్నగారి బసన్న, ఈడిగి శంకరప్పలను, పెద్ద హరివాణం ఏపీసీఎస్ సొసైటీ చైర్మన్‌గా బి. ఆదిశేషిరెడ్డి, సభ్యులుగా తుంబలం గోవిందప్ప, సయ్యద్ బాషాలను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోని నియోజకవర్గంలో మూడు సొసైటీలకు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ప్రతిపాదించిన వాళ్లనే ప్రభుత్వం నియమించింది.


బి.ఆది శేషిరెడ్డి

ఒక్క రూపాయి ఇవ్వలేదు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న
- కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద బైఠాయింపు


అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద బైఠాయింపు


అడ్డుకున్న పోలీసులు.. తోపులాట

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,600 కోట్లు కేటాయించిందని, ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తూ కలెక్టరేట్‌లోకి ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు దూసుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు బందెల నాసర్‌జీ, ఎస్.షాబీర్‌బాషా మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలపై ఘర్షణకు దిగిన పోలీసు అధికారులు కూటమి ప్రభుత్వానికి పనిచేస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులకు, పీజీ విద్యకు శాపంగా మారిన జీవో.77ను రద్దు చేయాలని, అదే విధంగా పెండింగ్ ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'యువగళం' పాదయాత్రలో నారాలోకేశ్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బకాయిలు విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన నాయకులను అరెస్టు చేసి సొంతపూచీకత్తు విడుదల చేశారు. ఈ అరెస్టుకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, శరత్ కుమార్, దామాస్, ఉపాధ్యక్షులు దస్తగిరి, వీరేష్, సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబి, అశోక్, నాయకులు శేఖర్, అల్తాఫ్, శివ, మోహన్, వినోద్, హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి


మధుప్రియ (ఫైల్)

బనగానపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప గ్రామంలో కుక్కకాటుకు నాలుగేళ్ల చిన్నారి మధుప్రియ మృతి చెందింది. వివరాలివీ.. మండలంలోని కైప గ్రామానికి చెందిన జయరాముడు, రామేశ్వరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమార్తె మధుప్రియ గురువారం రాత్రి అంగడికి వెళ్లి తిరిగి వస్తుండగా పాపపై కుక్కలు దాడి చేశాయి. దీంతో భయభ్రాంతులకు గురైన మధు ప్రియ భయపడి స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం మధుప్రియ మృతి చెందింది.

గోడ కూలి బాలుడి మృతి

పాణ్యం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొగర్చేడు గ్రామంలో శుక్రవారం గోడకూలి ముల్లా ఆరీఫ్ (5) మృతి చెందినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాము తెలిపారు. పాత ఇల్లు రిపేరి చేస్తుండగా పాత గోడ కూలి అక్కడే ఆడుకుంటున్న ఆరీఫ్‌పై గోడ కూలడంతో ఆరీఫ్‌తోపాటు తాత కరీముల్లాకు తీవ్రగాయాలయ్యారు. దీంతో హుటాహుటిన నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆరీఫ్ మృతి చెందినట్లు తెలిపారు. ఆరీఫ్ తల్లిదండ్రులు షాహీన్, మహబూబ్ బాషా కోవెలకుంట్ల మండలం కొప్పెర్ల నివాసం. వీరికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమరుడు ఆరీఫ్ తన తాత వద్ద ఉంటున్నట్లు తెలిపారు. ఆర్ఐ రాము, వీఆర్వో రామేశ్వరమ్మ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పాణ్యం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల షాపులపై దాడులు

18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేత


ఎరువుల షాపుల్లో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు దాడులు నిర్వహించారు. ఎరువులు గోదాముల్లో నిల్వలు చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ 'నిల్వలు వదంతులు' అనే కథనానికి వ్యవసాయ యంత్రాంగం శుక్రవారం కదిలింది. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక బృందాలు జిల్లాలోని వివిధ గోదాములపై దాడులు చేశాయి. ఏడీఏ ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి ప్రసాద్, సాంకేతిక వ్యవసాయాధికారి కిశోర్, సహాయ వ్యవసాయ సంచాలకులు గిరీష్ ఆధ్వర్యంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి ఉదయం నుంచి సాయంత్రం వరకు దాడులు నిర్వహించారు. నూనెపల్లెలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా స్టాక్ నిల్వచేసిన సుదర్శన్ ట్రేడర్స్‌కు చెందిన 18.45 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని గోదాములు, ఎరువుల దుకాణాల యాజమానులు 1985 చట్టం ప్రకారం ఎరువుల వ్యాపారం చేయాలని అన్నారు. ఎరువుల నిల్వలను ప్రతిరోజు మండల వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎమ్మార్పీ ధరకు విక్రయించి రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధ్యతలు చేపట్టిన ఈఈలు


జలవనరుల శాఖ పీడబ్ల్యూ డివిజన్ ఈఈగా బాధ్యతలు చేపట్టిన విజయరాజును అభినందిస్తున్న ఇంజనీర్లు


హంద్రీనీవా కర్నూలు డివిజన్-2 ఈఈగా బాధ్యతలు చేపట్టిన ప్రసాద్

కర్నూలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ పబ్లిక్ వర్క్స్ (పీడబ్ల్యూ) ఎఫ్ఆర్ఎల్ కర్నూలు డివిజన్ ఈఈ (ఎఫ్ఏసీ)గా బి. విజయరాజు, హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు డివిజన్-2 ఈఈ (ఎఫ్ఏసీ)గా ఎన్. ప్రసాద్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయరాజు 1996లో ఏఈఈగా జలవనరుల శాఖలో ఉద్యోగంలో చేరారు. ఆళ్లగడ్డ తెలుగుగంగ ప్రాజెక్టు, ఎమ్మిగనూరులో గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో సుదీర్ఘకాలంగా పని చేశారు. 2014లో డీఈఈగా పదోన్నతిపై కడప జిల్లాకు బదిలీ వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం క్వాలిటీ సెల్ సబ్ డివిజన్ డీఈఈగా పని చేస్తున్న ఈయనకు ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఎన్. ప్రసాద్ రావు బీటెక్ పూర్తి 1986లో ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా ఉద్యోగంలో చేరారు. 2013లో డీఈఈగా పదోన్నతి పొందారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ కాలం పని చేశారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా బత్తలపల్లి టీబీపీ హెచ్చెల్సీ డీసీ సబ్ డివిజన్ డీఈగా పని చేస్తూనే కేసీ కెనాల్ కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ప్రభుత్వం హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు డివిజన్-2 ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ట్రాక్టర్ కింద పడి కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నాపరాళ్ల లోడుకు వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిం ది. అంకిరెడ్డిపల్లెకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తలారి వీరన్న, బండ చిన్న శ్రీరాములు(78) చింతలాయపల్లె పరిధిలోని నాపరాతి గనుల్లో ట్రాక్టర్లో బండలు లోడు చేసుకొని వస్తుండగా, ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న బండ చిన్నశ్రీరాములు ఎగిరి కిందడ్డాడు. ట్రాక్టర్ అతని కాళ్లపై ఎక్కి వెళ్లడం తో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

డ్రైనేజీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

నంద్యాల టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో పట్టణ పరిధిలోని రామనాథరెడ్డి నగర్‌లో చివరకు ఉన్న మురుగు కాలువలో గుర్తు తెలియన మహిళ శవం లభ్యమయినట్లు ఏఎస్పీ మందా జావళి తెలిపారు. మృతదేహం దుర్వాసన రావడంతో స్థానికులు సమాచారం ఇవ్వడంతో విచారణ చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇక్కడే వేసి సుమారుగా మూడు నాలుగు రోజులు అయిండొచ్చునని తెలిపారు. ఆమెకు సుమారుగా 40 ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. కాల్వలోని తీసినప్పుడు ఆమె వద్ద పర్సు కొంత డబ్బులు ఉన్నట్లు తెలిపారు. అయితే ఎటువంటి ఆధారాలు ఇంకా తెలియలేదని, బృందాలు ఏర్పడి విచారణ చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దేవనకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందు తాగి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. ఈఘటన మండలంలోని బంటుపల్లి గ్రామంలో చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సంజీవుడు, రాధమ్మ దంపతుల పెద్ద కుమారుడు శ్రీనాథ్ గౌడ్(16). అతడు పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటి వద్ద ఉంటూ ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేములు ఆడేవాడు. దాదాపు రూ.20 వేలకు పైగా ఖాతాలో డబ్బులు ఖాళీ చేయడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై గత నెల 9వ తేదీన పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. దాదాపు నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లోకాయుక్త జోక్యంతో లైబ్రరీ సెస్సు వసూలు

కర్నూలు లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు స్థానిక సంస్థల నుంచి జిల్లాలోని గ్రంథాలయాలకు రావాల్సిన లైబ్రరీ సెస్సు రాష్ట్ర లోకాయుక్త జోక్యంతో వసూలైంది. ఈ మేరకు రాష్ట్ర లోకాయుక్త రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మున్సిపాలిటీలతో పాటు పలు స్థానిక సంస్థలు జిల్లాలోని గ్రంథాలయాలకు 2007 నుంచి 2017 వరకు రూ.3.67 కోట్లు బాకీ పడ్డాయి. ఈ మేరకు జిల్లాకు చెందిన సాంబశివ రావు అనే వ్యక్తి రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. దీంతో కలెక్టర్ విచారణ చేసి బకాయిలు ఉన్న మాట వాస్తవమేనని గ్రంథాలయాలకు ఆ మొత్తాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్లు లోకాయుక్తకు తెలియజేశారు. దీంతో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో రూ.3.67 కోట్లు లైబ్రరీ సెస్సు వసూలైనట్లు తెలిపారు. స్థానిక సంస్థల మధ్య జవాబుదారితనాన్ని పెంపొందించడానికి రాష్ట్ర లోకాయుక్త కృషి చేస్తున్నట్లు లోకాయుక్త రిజిస్ట్రార్ ఆ ప్రకటనలో తెలిపారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకారం

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి సమావేశం సమావేశం శుక్రవారం చైర్మన్ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టి మధ్యలోనే ఆగిపోయిన కాంప్లెక్స్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. కొన్ని గోదాములు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని రిపేరి చేయిస్తామని చెప్పారు. ఏసీ గోదాము నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఉల్లి కొనుగోలు చేసేందుకు అనుమతులు తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులు పండించిన ఉత్పత్తులను ఇక్కడే అమ్ముకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. చైర్మన్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న దుకాణాల కాంప్లెక్స్ నిర్మాణాన్ని, గోదాముల మరమ్మతులు, ఏసీ గోదాము నిర్మాణం తదితర అంశాలపై తీర్మానాలను కమిటీ సభ్యులు ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుధాకర్ యాదవ్, డైరెక్టర్లు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మహేశ్వరి, పెద్ద దస్తగిరి, విజయలక్ష్మి, రాములమ్మ, మల్లీశ్వరి, నిర్మల, కార్యదర్శి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే భూమా

నంద్యాల టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాను ఆయన కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కలిశారు. ఆయన మాట్లాడుతూ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై మాట్లాడామని అలాగే శాంతి భద్రతలపై చర్చించినట్లు తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడంలో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): యువత తన ఆలోచనాశక్తితో అన్ని రంగాల్లో ముందుంటూ ఆదర్శంగా నిలవాలని శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావానికి గురికాకుండా లక్ష్యాలను ఏర్పరుచుకొని మన మేధోశక్తితో వాటిని అధిగమించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు వెంకటరావు, లక్ష్మీదుర్గ, రత్న, విజయకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వానం

వెలుగోడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల,కర్నూలు జిల్లాల గ్రామీణ వైద్యుల మహాసభ ఈనెల 16న కర్నూలు లో జరగనుంది. ఈ మహాసభకు రావాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిని వెలుగోడు మండల గ్రామీణ వైద్యులు ఆహ్వానించారు. జాకీర్, నాగ శేషులు, మునీరుద్దీన్, అమీర్, రాజప్ప, సలీం తదితరులు ఉన్నారు.

రైల్వే స్టేషన్ తనిఖీ

నంద్యాల టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఏఎస్పీ యుగంధర్‌బాబు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూళనలో భాగంగా గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు అక్రమ రవాణాను అరికట్టడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల గురించి సమాచారం తెలిస్తే 1972 కు గానీ 112 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ సూర్యమౌళి, ఈగల్ టీం సిబ్బంది, ఎస్ఐలు గంగన్నయాదవ్, కుమారి, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు హోల్‌సేల్ వ్యాపారంపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం కార్తీక్

జూపాడుబంగ్లా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలు ఉత్పత్తి చేయడమే కాకుండా హోల్‌సేల్ వ్యాపారం దిశగా అడుగులు వేయాలని నాబార్డు ఏజీఎం కార్తీక్ సూచించారు. మండలంలోని తాటిపాడు గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల కేంద్రాని తనిఖీ చేశారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ వస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కేసీ కాలువ సాగునీటి సంఘం అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మన్నగౌడు, ఏఈవో నాగేశ్వరరావు, ఎంపీఈవో మధు, రైతులు ఆదినారాయణరెడ్డి, వెంకట రంగారెడ్డి, మన్సూర్‌బాషా, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

నందికొట్కూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా, డీఏపీలు కొరత ఉన్నాయని, వాటి కోసం రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం నాయకులు గాబ్రియేలు, వేల్పుల ఏసన్న, కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, మహిళా సంఘం నాయకురాలు బీబీ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

మిడుతూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని మాడల్ స్కూల్‌లో శుక్రవారం బీఎల్‌వోలకు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసుధాకర్ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కళావతి పాల్గొన్నారు.

ధరల వివరాలు నమోదు చేయాలి

జూపాడుబంగ్లా, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రతి దుకాణం వద్ద నిత్యావసర సరుకుల ధరలు ప్రకటించి, రిజిస్టర్ నమోదు చేయాలని ఉపగణాంకాధికారి నాగరాజు అన్నారు. జూపాడుబంగ్లాలోని దుకాణ సముదాయాలను శుక్రవారం తనిఖీ చేశారు. సరుకుల ధరలు, రిజిస్టర్ నిర్వాహణలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల గణాంక అధికారి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నందికొట్కూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక సమస్యలతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలివీ.. సంగయ్యపేట చెందిన షేక్ జాకీర్(30), ఆయన భార్య ఇద్దరూ ఇంట్లో ఉంటారు. ఆయన భార్య గురువారం దామగట్ల గ్రామానికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో కపిలేశ్వరం పాఠశాల

● మత్స్యశాఖ కేంద్రంలో విద్యా బోధన ● ఇరుకు గదిలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



శిథిలావస్థలో ఉన్న కపిలేశ్వరం పాఠశాల ఇదే



ఇరుకు గదిలో విద్యార్థులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

కొత్తపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అది ఓ మారుమూల అటవీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల. అక్కడ పాఠశాల శిథిలావస్థకు గురై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. దీంతో చేసేదేమీ లేక ఆ ఉపాధ్యాయుడు సమీపంలోని మత్స్యశాఖకు సంబంధించిన ఓ చిన్న పాటి గదిలో విద్యాబోధన చేస్తున్నారు. కపిలేశ్వరం గ్రామం మండల కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామం కృష్ణానది ఒడ్డున అటవవీ ప్రాంతానికి అతీ సమీపంలో ఉంటుంది. ఈ గ్రామంలో 110 మంది జనాభాతో పాటు 76 మంది ఓటర్లు ఉండగా.. 34 గృహాలు ఉన్నాయి. ఇక్కడ రెండు దశాబ్దాల క్రితం మండల పరిషత్ పాఠశాల నిర్మించారు గానీ, నాణ్యత ప్రమాణాలు లోపించి అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠశాల భవనం వర్షాకాలంలో పూర్తిగా నీరు కారుతుండటంతో సమీపంలో వృథాగా ఉన్న మత్స్యశాఖ కేంద్రంలోని ఓ చిన్నపాటి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో మండలంలోని గువ్వలకుంట్లలోని డీఎన్‌టీ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు డిప్యుటేషన్‌పై వచ్చి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మారుమూల అటవి ప్రాంతంలోని కపిలేశ్వరంలో విద్యార్థులకు నూతన పాఠశాల భవనం నిర్మించి రెగ్యులర్ ఉపాధ్యాయున్ని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఈ ప్రాంతంలోని విద్యార్థులు అడవి బాట పట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

'సుపరిపాలనలో తొలి అడుగు'లో ప్రజాప్రతినిధులు



నంద్యాలలో సమస్యలు వింటున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్



ఆత్మకూరులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా



చిందుకూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

నంద్యా రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఇంటికి ప్రభుత్వం పథకాన్ని అందజేస్తోందని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని 36వ వార్డులో శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేసి ఆర్థిక భారాన్ని తగ్గించారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఉత్తమ పాలన అందిస్తున్నామని, ఇతర రాష్ట్రాలు సైతం అభినందించే రీతిలో కూటమి ప్రభుత్వ పాలన ఉందని అన్నారు. మహిళా రక్షణ కోసం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టి రక్షణ, బాధ్యతను పోలీస్‌శాఖకు అప్పగించారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, పుల్లయ్య కుమార్‌బాబు, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని 21వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు మద్దిలేటి, ముర్తుజావలి, జాకీర్ హుస్సేన్, వేణుగోపాల్, సురేంద్ర, వడ్డె శ్రీనివాసులు, చిన్న నాగన్న, నాగమద్దయ్య, అబ్దుల్లా, మీనాక్షి, వనజ, అనూరాధ, కళాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పగిడ్యాల: నెహ్రూనగర్ గ్రామంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అందజేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామస్వామి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కారించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సూచించారు. మండలంలోని నెహ్రూనగర్‌లో సచివాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు, టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్‌రెడ్డి, నాయకులు లోకానందరెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: దుద్యాల, కొత్తమాడుగుల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, నాయకులు మల్లారెడ్డి, జీఎండీ రఫీ, మన్సూర్ బాషా, నూర్ అహ్మద్, మున్నా, అబ్దుల్ అజీజ్, చిన్న పుల్లారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు మరచిపోవద్దని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. పట్టణంలోని రహమత్‌నగర్‌లో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా ఇంటింటికి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇప్పటివరకు ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆరా తీశారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు నాగూర్‌ఖాన్, అలిహుసేన్, రవిప్రసాద్, సుబ్బయ్య, షాబుద్దీన్, నూర్‌బేగ్, షాకీర్, బి.ముర్తుజా న్యామతుల్లా, ఖాజీమొద్దీన్, రఫీక్, జబీవుల్లా, జాకీర్, నజీర్ అహ్మద్, బాషా, నబీరసూల్, సరోజమ్మ, ఉమాదేవీ, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

ఆత్మకూరురూరల్: ఒప్పంద అధ్యాపకుల సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకుల జేఏసీ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రహమత్ నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పర్యటిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

గడివేముల: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని చిందుకూరు, గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, పంట దిలీప్‌కుమార్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్ఏ రఫిక్, గిరిబాబు, బీవీఎన్ రాజు, పాణ్యం మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ గీత, కృష్ణయాదవ్, పంట రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుభద్రమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మహానందిలో న్యాయాధికారి పూజలు



మహానందిలో న్యాయాధికారి లీలావతిని ఆశీర్వదిస్తున్న వేదపండితుడు

మహానంది, జూలై 11(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్నూలు జిల్లా నాలుగో అదనపు డిస్ట్రిక్ సెషన్స్ న్యాయాధికారి లీలావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మహానంది ఆలయ ముఖమంటపం వద్ద ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో న్యాయాధికారి అభిషేకార్చనలు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

నంద్యాల హస్పిటల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా అలాంటి సెంటర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సలహా కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో డెకాయ్ ఆపరేషన్లు పటిష్టంగా అమలుచేసి స్త్రీ నిష్పత్తిని గణనీయంగా పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డీఐవో సుదర్శన్‌బాబు, డెమో ఇన్‌చార్జి రవీంద్రనాయక్, డాక్టర్లు పద్మజ, అరుణజ్యోతి, శ్రావణ్‌కుమార్, ఎన్‌జీవోలు పాల్‌రాజారావు, రామారావు, న్యాయవాది మోతిలాల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మకు బోనాల సమర్పణ

మహానంది, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం పురస్కరించుకొని మహానంది సమీపంలోని సుంకులమ్మ అమ్మవారికి శుక్రవారం దేవస్థానం కాలనీకి చెందిన మహిళలు బోనాలు సమర్పించారు. అమ్మవారికి బోనాలతో పాటు చీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పోస్టరును ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమల్లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆరోపించారు. పట్టణ శివార్లలోని సిద్దేపల్లి రస్తాలో గల ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం 'బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ' అంశంపై నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో లేనిపోని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు నేడు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. అరకొర హామీలను అమలు చేస్తూ అన్ని చేశామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మోసపూరిత హామీలతో సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వైసీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటని ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, కచ్చితంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అదేక్రమంలో రెడ్‌బుక్ సంస్కృతిని విడనాడాలని, ఇది ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదని అన్నారు. అనంతరం బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ అంశంపై రూపొందించిన ప్రత్యేక క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మోమిన్ అహ్మద్ హుసేన్, సయ్యద్‌మీర్, విజయ్‌చౌదరి, మారుబోతుల విజయ్, మోమిన్ మునీర్‌బాషా, సుల్తాన్, అంబాల ప్రభాకరరెడ్డి, లాలం రమేష్, మహేశ్వర రెడ్డి, తిరుపమరెడ్డి, యూనూస్, జయరాజు తదితరులు ఉన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

బండిఆత్మకూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు దేవస్థానాలకు ధర్మకర్తల మండలికి రెండు సంవత్సరాల పదవీ కాలానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఈవో ఆకృతి నాగప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాటాలడుతూ మండలంలోని సంతజూటూరు చెన్నకేశవ, భోజనం ముక్తీశ్వర, బండిఆత్మకూరు లక్ష్మీ జనార్దనస్వామి ఆలయాలకు ఒక్కొక్క ఆలయానికి 9 మంది సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నంద్యాలలోని రైతునగరంలో ఉన్న ఏసీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

20వేల క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి శుక్రవారం 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. కాగా తెలుగుగంగ కు 14000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ కు 6000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు వివరించారు. జీఎన్ఎస్ఎస్ గేట్లను ఇంకా తెరవలేదని తెలిపారు.

లతీఫియా మసీదు వద్ద ఉద్రిక్తత

నంద్యాల టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని లతీఫియా మసీదు వద్ద ఉదయం ఉత్కంఠ వాతావరణ నెలకొంది. దీంతో వన్‌టౌన్ పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాలకు సర్దిచెప్పి పంపిం చారు. ఈ మసీదు ప్రాంగణంలో గతంలో మదరసా ఉండేది దీన్ని ప్రస్తుత ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ నడిపేవారు. కానీ అప్పటి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు రెంట్ సరిగా కట్టలేదని మదరసా భవనానికి తాళాలు వేసి సీజ్ చేసింది. అయితే కూటమి ప్రభుత్వంలో మంత్రి ఫరూక్ వర్గం వారు లతీఫియా మసీదుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. దీంతో గత వారంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అయితే శుక్రవారం నూతన కమిటీని సన్మానించాలని నిర్ణయించిన మంత్రి వర్గం వారు లతీఫియా మసీదు వద్దకు చేరుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కలుగజేసుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. అనంతరం మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ మొదటి నుంచి వక్ఫ్ బోర్డు స్థలాన్ని కబ్జాకు గురికాకుండా చూసుకుని ఇక్కడ మదరసాను ఏర్పాటు చేసి అభివృద్ధి చేశానని చెప్పారు. మంత్రి వర్గానికి చెందిన ఖలీల్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులందరూ అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చామని, దీనికి అడ్డుపడడం మంచి కాదని అన్నారు.

17న సామాజిక తనిఖీ బహిరంగ సభ

పాములపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పాములపాడులో ఈ నెల 17న ఉపాధి పనులపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. 2024 నుండి 2025 మార్చి వరకు మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించిన అంశాలను 17న స్థానిక ఎంపీడీవో కార్యలయం ఆవరణలో బహిరంగ చర్చ జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

నంద్యాల హస్పిటల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు నంద్యాలపట్టణంలోని గురురాజ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12నుంచి 14వరకు సత్యసాయి జిల్లా కదిరిలో జరిగే 7వ రాష్ట్ర స్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను, పీఈటీ పుల్లయ్యను షేక్షావలిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

శక్తి యాప్‌పై అవగాహన

నంద్యాల టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎస్పీ అదిరాజ్ సింగ్‌రాణా ఆదేశాలతో శక్తియాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ జయరాములు మాట్లాడుతూ.. శక్తి టీం లుగా ఏర్పడి పాఠశాలలు, కళాశాలలు, వివిధ ప్రాంతాల్లో అవగాహన కల్పించి వారితో యాప్‌ను డౌన్‌లోడు చేయిస్తున్నామని తెలిపారు. దీంతో వారికి అవసరమైన సమయాల్లో రక్షణ ఉంటుందన్నారు. అలాగే శక్తి వాట్సాప్ నెంబర్ 799348511 నెంబర్‌కు మహిళలు ఎటువంటి సమస్య ఉన్న ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే చిన్నపిల్లలపై జరిగే నేరాలపై తెలిసిన వెంటనే 112, 181, 1098, 1930 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి టీం పాల్గొన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



తమ్మరాజుపల్లెలో గోపూజ చేస్తున్న మహిళలు

పాణ్యం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 వతేదీన తమ్మరాజుపల్లెలోని రామేశ్వరస్వామి దేవస్థానంలో ప్రారంభమైన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గోపూజ నిర్వహించారు. శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై చేసిన ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ సంపద కన్నా సంస్కారం గొప్పది అని అన్నారు. అయితే నేటి యువత సంపదను వరించి సంస్కారాన్ని వదలివేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నంబూరు శ్రీ కాశీవనాశ్రమం పురాణ ప్రబోధ కులు శ్రీనివాస రామానుజదాసు. సర్పంచ్ విజయగౌరి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మధు, పార్థసారథి, విశ్రాంత ఆర్ఐ వెంకటరెడ్డి, దుబాయ్ శీను, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా సన్మాన సభ

నంద్యాల హస్పిటల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాల చాబోలులో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఏపీరెడ్డి పదవీ విరమణ పొందడంతో శుక్రవారం సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వ్యాయామోపాధ్యాయులు హాజరై ఘనంగా సన్మానించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పశ్చిమరాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఈవోలు శివరాంప్రసాద్, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, ఏపీ స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరీముల్లాబాషా, కార్యవర్గసభ్యులు సీజర్‌రెడ్డి, దుర్గారావు, సుధాకర్, లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నీలిషికారి కాలనీలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊట ధ్వంసం చేసి ఒక మహిళపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నీలిషికారి కాలనీలో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేసి షికారి సుగుణ అనే మహిళ ఇంటిలో నాటుసారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 90 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి నందికొట్కూరు కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబి షన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ కుమారి, వెంకటేశ్వర్లు, శ్వేతారాణి, శివన్న, మధు ప్రసాద్ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రజల కోసమే కూటమి ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

డోన్ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిందని జనసేన డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం అన్నారు. శుక్రవారం పట్టణంలో జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జనసేన గురించి వ్యంగంగా మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీని ప్రజలు ఛీకొట్టినా బుద్ధి రావడం లేదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనవసరమైన విమర్శలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారని, విధ్వంస పాలన నుంచి ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. సమావేశంలో జనసేన నాయకులు గణేష్, జయచంద్ర, మధు, కృష్ణ, శివాజీ, హనీఫ్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించండి: పీడీ



పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న పీడీ, అధికారులు

సంజామల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల రైతులు పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సూర్యనారాయణరావు కోరారు. శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జయంతితో కలిసి మండలంలోని ముదిగేడు, ఆకుమళ్ల గ్రామాల్లో పర్యటించారు. ముదిగేడులో ఉపాధి పనులు పరిశీలించారు. ఆకుమళ్ల గ్రామంలో ఖాజాహుసేన్ అనే రైతు పండ్ల తోటలను పరిశీలించారు. వరి పంట సాగు చేసే వచ్చే ఆదాయానికి రెట్టింపు ఆదాయం పండ్ల తోటల సాగులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఓబులేసు, అక్బర్ వలి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి చెందిన కుటుంబాలను గుర్తించాలి

కోవెలకుంట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన కుటుంబాలను గుర్తించాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పీ-4 సర్వే చేశామన్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 25 ఎకరాల పైబడ్డ రైతులు, బిజినెస్ పరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన కుటుంబాలను, అలాగే ఇతర దేశాల్లో ఉంటున్న వారిని గుర్తించి వీరి ద్వారా పేద కుటుంబాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వరప్రసాదరావు, ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు , వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారి మృతి బాధాకరం

బనగానపల్లె, జూలై 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప గ్రామంలో కుక్కల దాడిలో నాలుగేళ్ల చిన్నారి మధుప్రియ మృతి చెందడం బాధాకరమని ఆర్డీవో నరసింహులు అన్నారు. శుక్రవారం కైప గ్రామాన్ని ఈవోఆర్డీ సతీశ్‌కుమార్‌రెడ్డితో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. గ్రామంలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన పౌరాణిక నాటక ప్రదర్శనలు



కళాకారులను అభినందిస్తున్న డాక్టర్ వీడీ రాజగోపాల్

కొలిమిగుండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించి పౌరాణిక, సాంఘీక నాటక ప్రదర్శనలు ముగిశాయి. ఆలయ నిర్వాహకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భశాఖ మాజీ సంచాలకులు డా.వీడీ రాజగోపాల్ ఆధ్వర్యంలో గురుపౌర్ణిమ వేడుకల్లో భాగంగా ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులతో చింతామణి, శ్రీకృష్ణరాయబారం, శ్రీకృష్ణ తులాభారం, ఉంగరాల శ్రీను, భవాని శీను తదితర నవమాంకాల పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరోవైపు ప్రస్తుత పల్లెటూరి రాజకీయ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు డా.వీడీ రాజగోపాల్ రచించిన 'ఎర్ర సింధూరం యాడబాయ తల్లి' అనే నాటక ప్రదర్శన శ్రోతలకు ఎంతగానో ఆసక్తి కలిగించింది. హైదరాబాదుకు చెందిన సురభి ప్రియాంక ఈ నాటకంలో అద్భుతంగా నటించి, ప్రేక్షకుల మన్ననలు పొందారు. అనంతరం కళాకారులను డా.వీడీ రాజగోపాల్, పేరం బయ్యపురెడ్డి, వీడీ రామకృష్ణ సన్మానించారు.

వైసీపీ హయాంలో.. విద్యావ్యవస్థ నాశనం

- విప్లవాత్మక మార్పులతో గాడిలో పెడుతున్నాం
- మౌలిక వసతుల కల్పనకు కృషి
- నియోజకవర్గ స్థాయి విద్యా సదస్సులో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



విద్యా సదస్సులో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనమైందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యాసదస్సు డీఈవో జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఉన్న సమస్యలను క్లుప్తంగా ఏకరువు పెట్టారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజయంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ప్రతి పాఠశాలలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, విద్యా మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వపాఠశాలలను ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. నాడు-నేడు పనుల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. పనులు పూర్తికాకపోవడంతో వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు తమపై పడ్డాయని విమర్శించారు. అనుభవం లేని జగన్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని విమర్శించారు. నీటి సమస్యపై ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులతో పూర్తి వివరా లతో సమగ్ర నివేదిక రూ పొందించి పదిరోజుల్లో నివే దిక సమర్పించాలన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా కుటుంబంలో చదు వుతున్న అందరి పిల్లలకు తల్లికి వందనం ఇచ్చి ఇచ్చిన హామీని నెరవేర్చు కున్నామన్నారు. అలాగే కూ టమి ప్రభుత్వంలో నాణ్య మైన భోజనం విద్యార్థులకు వడ్డిస్తున్నా మ న్నారు. మూడు విభాగాలుగా విభజించి పాఠశాల మౌలిక వసతులపై నివేదిక సమ ర్పించాలని మంత్రి విద్యాధికారులను, ఉ పాధ్యాయులను కోరారు. సమావేశంలో పం చాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, మండల విద్యాధికారులు వెంకటసుబ్బయ్య, ఈశ్వరయ్య, అవుకు, కొలిమిగుండ్ల, సంజా మల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన ఎంఈవోలు, సర్వశిక్ష అభియాన్ అధికారులు, పాల్గొన్నారు.

'తొలి అడుగు'తో వైసీపీలో గుబులు : మంత్రి బీసీ

అవుకు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గ్రామస్థాయి నుంచి విజయవంతంగా సాగుతుండటంతో వైసీపీలో గుబులు రేగుతుందని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి మంత్రి బీసీ హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో రూ. 40 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మంత్రి బీసీ మాట్లాడుతూ పునరావాస గ్రామమైన చెర్లోపల్లె గ్రామాన్ని దశలవారిగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలనాగిరెడ్డి, నారపురెడ్డి, శివరాంరెడ్డి, రామకృష్ణారెడ్డి, మొట్ల రామిరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, మారం పుల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేషిరెడ్డి, బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటరమణనాయక్, రమణ, తిక్కన్న, అరుణ్‌కుమార్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు ఎందుకు ఓడించారు?

- వైసీపీపై ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులను ప్రజలు ఎందుకు ఓడించారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, అబ్బిరెడ్డి హరిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చేసింది మాత్రం గోరంతా.. చెప్పుకునేది మాత్రం కొండంతగా బుగ్గన తీరు ఉందని అన్నారు. భవన నిర్మాణాలు చేపట్టి ఎక్కడ పూర్తి చేశారని నిలదీశారు. వైసీపీ నాయకులు సినిమా డైలాగులు మానుకోవాలని సూచించారు. టీడీపీపై మాజీ మంత్రి బుగ్గన దుర్మార్గంగా నిందలు వేయడం బాధాకరమన్నారు. త్వరలో చెరువులకు నీటిని నింపుతామన్నారు. శాశ్వతంగా గోరుకల్లు, హంద్రీనీవా నుంచి నీరందించి శాశ్వత నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, అబ్బిరెడ్డి హరిలు మాట్లాడుతూ ప్రజావేదికను కూల్చిన ఘనత వైసీపీకే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అన్నీ హామీలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సాగిస్తున్న తరుణంలో ప్రజలను వైసీపీ తప్పుదోవ పట్టిస్తుందన్నారు.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం

ప్యాపిలి: పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బావిపల్లి, హుసేనాపురం, పీఆర్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్ రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, ఖాజాపీర్, లింగన్న, వెంకటేష్, గుండాల చంద్రశేఖర్, ప్రసాద్, అలేబాదు పరమేష్, సుదర్శన్, మోహూరి రాము, సతీష్ పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో 20 అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న సప్తశైల రాజేష్

డోన్ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావే శంలో 20 అంశాలను అజెండాలో రూపొందించాలని కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఫ్లై ఓవర్ కింద అక్రమంగా ఏర్పాటు చేసుకున్న బంకులను తొలగించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఇందుకు చైర్మన్ స్పందిస్తూ ముందుగానే బంకు యజమానులకు నోటీసులు ఇచ్చామని, త్వరలో తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ ప్రసాద్ గౌడు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు: డీఎస్పీ ప్రమోద్



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పాఠశాలల వద్ద నిషేధిత పదార్థాలు గుట్కా, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే సంబంధిత షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఆపరేషన్ సెఫ్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సబ్ డివిజన్‌లోని ప్రతి పాఠశాల, కాలేజ్‌లకు వంద మీటర్ల సమీపంలో ఉన్న దుకాణాలలో తనిఖీలు చేస్తామన్నారు. పొగాకు సంబంధించిన చుట్ట, బీడి, సిగరేట్లు దుకాణాల్లో అమ్మవద్దని సూచించారు. విద్యార్థులు మంచి మార్గంలో నడవాలంటే వారి పాఠశాల చుట్టు పక్కల మంచి వాతావరణం ఉండాలని అన్నారు. మత్తు పదార్థాలు సేవించనా, విక్రయించిన చట్టరీత్యానేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరు వీటిని నిషేధించాలని ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులక సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఏపీజీబీ అధికారుల తీరుపై మంత్రికి ఫిర్యాదు

కొలిమిగుండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె ఏపీజీబీ బ్యాంకు అధికారులు పొదుపు మహిళల పట్ల అవలంబిస్తున్న తీరుపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. పొదుపు గ్రూపులకు రుణాలు మంజూరు చేసే విషయంలో సహకరించడంలేదని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీనారాయణమ్మ, మునీశ్వరి తదితరులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రుద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ శాంతకుమారి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రూ. 10లక్షలు మంజూరు కాగా సీసీ పనులు చేపట్టామన్నారు. రోడ్డు పనులను పీఆర్ ఎఇ కమాల్‌సాహెబ్ పరిశీలించారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, పెద్దపక్కిర, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి, దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాతకు సారె సమర్పణ

బనగానపల్లె, జూలై 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాతకు శుక్రవారం చీరెసారెను సమర్పణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మతో పాటు అధిక సంఖ్యలో మహిళలు చౌడేశ్వరీమాతకు చీరె, సారె సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఊరేగింపు వెంట చెక్క భజన, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవుకు : మండలంలోని గుండ్ల శింగవరం గ్రామ సమీపంలో వెలసిన కనక దుర్గమ్మ శాకంబరి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భవాని సుబ్బరాయుడు కనకదుర్గమ్మ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, నిమ్మకాయలు, పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరి, గంగమ్మ ఆలయాల్లో అమ్మవారు శాకంబరి అలంకారంలో శుక్రవారం కొలువుదీరారు. అమ్మవారికి కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరింప చేశారు. చీర, సారె సమర్పించి సామూహిక వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఆషాఢ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వారాహీ దేవి మాతాకు సామూహిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారాహీదేవి మాతాకు ప్రధాన అర్చకుడు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు సామూహిక ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని విశ్వరూప నగర్ కాలనీలో వెలసిన కాళిమాత అమ్మవారి ఆలయంలో అర్చకులు చంద్రశేఖర్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం కట్టే గౌరి దేవి షణ్ముఖచారి కుటుంబ సభ్యులు కాళిమాతకు వడి బియ్యం సమర్పించారు. భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ మహిళ కమిటీ అధ్యక్షురాలు అనురాధ, కృష్ణమాచారి పాల్గొన్నారు.



చౌడేశ్వరీమాతకు సారె సమర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ, భక్తులు



బేతంచెర్లలోని అమ్మవారిశాలలో వారాహీదేవి మాతకు సామూహిక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు



అవుకు: కనకదుర్గమ్మకు..



చాగలమర్రి గ్రామంలో..

14న జాతీయ అప్రెంటిషిప్ మేళా

డోన్ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14న ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నామని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేళాకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ఐటీఐ పాసైన అభ్యర్థులు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

అధిక రక్తపోటు అత్యంత ప్రమాదకరం

శిరివెళ్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మనిషిలో అధిక రక్తపోటు అత్యంత ప్రమాదకరమని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్ అన్నారు. ఎన్సీడీ 3.0 క్వాలిటీ అసెస్మెంట్ సర్వేలో భాగంగా మెడికల్ కళాశాల విద్యార్థులు శుక్రవారం గ్రామంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రివెంటివ్ మెడిసిన్ హెచ్‌వోడీ విజయ కుమారి, అసిస్టెంట్ ప్రొఫెషర్లు జాహ్నవి, హేమలత, వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు



గౌస్‌పీర్‌షా ఖాద్రి దర్గాలో ఫతెహాలు చేస్తున్న మత పెద్దలు

చాగలమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని న్నమకానం వీధిలో వెలసిన గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో పీఠాధిపతులు సయ్యద్ గఫారియా, సయ్యద్ లాల్‌మియాలు, మత పెద్దలు కలిసి ఫతెహాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఫతెహాలు చేశారు. కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

చాగలమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని రిసోర్స్ పర్సన్, కార్యదర్శి సుజాత తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులచే సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రవరం: పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో భాగ్యలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం కొండమాయపల్లె గ్రామాన్ని ఆమె సందర్శించారు. పారిశుధ్య పనులు పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవిందనాయక్ పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అరటి పంటకు బీమా చేసుకోండి

చాగలమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అరటి పంట సాగు చేసే రైతులు ఈనెల 15లోగా బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి శుక్రవారం తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు పాసుపుస్తకం, జిరాక్స్ పత్రాలతో మీ సేవ కేంద్రాల్లో ఎకరాకు రూ.2,750 చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని అన్నారు. పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.50 వేలు వరకు నష్టపరిహారం అందుతుందని తెలిపారు. అవకాశాన్ని అరటిసాగు రైతులు వినియోగించుకోవాలని అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు చర్యలు



మహిళలకు సూచనలిస్తున్న సీఐ దస్తగిరిబాబు

శిరివెళ్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల భద్రతకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు అన్నారు. మండలంలోని యర్రగుంట్లలో మహిళలకు ఆయన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో మహిళలు, చిన్నారులపట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, చట్టాలు, పోక్సో యాక్ట్, శక్తి యాప్ తదితర వాటి గురించి ఆయన వివరించారు. కుటుంబాల్లో బాలికల విద్యను ప్రోత్సహించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

కోవెలకుంట్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నాగేశ్, డిపో సెక్రటరీ గిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, అధ్యక్షుడు నాగేశం, రమణ, శేఖర్, పేస్‌భాష, రవి, ఏడీసీ వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల ఎంపిక శిబిరం విజయవంతం

డోన్ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డోన్ నియోజకవర్గంలో 209 మంది దరఖాస్తులు చేసుకోగా.. వాటన్నింటిని రిజిస్ట్రేషన్ చేసి ఈ నెల 15న పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పరికరాలు అందజేస్తామని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, డోన్ అబ్జర్వర్ హరి, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ నారాయణ పాల్గొన్నారు.

అమృతవల్లి అమ్మవారికి అభిషేకం



బావి నుంచి కలశాలతో నీటిని తీసుకెళ్తున్న వేద పండితులు

ఆళ్లగడ్డ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం మూడో శుక్రవారం సందర్భంగా అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణంలోని బావి నుంచి వెండి బిందెలతో నీటిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి వేణు గోపాల్ స్వామి, మనీయర్ సౌమ్యనారాయణ స్వామి, అర్చకులు పాల్గొన్నారు.